# శిలావృక్షం

కాశీనాథుని సువర్చలాదేవి

ఎమెస్కో

# శిలావృక్షం

"సుధా!" అన్నయ్య పిలుపుతో చేతిలో పుస్తకం పక్కన పడేసి లేవబోతుండగా అన్నయ్యే దగ్గరకొచ్చాడు. అన్నయ్య ముఖంలో విసుగు కనిపిస్తూనే ఉంది. నిగ్రహించుకున్నాను.

"నేను రానన్నయ్యా! నాకివన్నీ విసుగని నీకు తెలియదా? ప్లీజ్, నన్నొదిలేయన్నయ్యా!" కళ్ళనిండా జాలి నింపుకుని మరీ అన్నాను.

అన్నయ్యంటే అందరిలాంటి అన్నయ్య కాదు. కళ్ళతో ఇంటిని పరిపాలిస్తున్న చక్రవర్తి. నాన్న, అమ్మ, చిన్నన్నయ్య అందరూ అన్నయ్య కనుసన్నలలో మెలుగుతున్నవారే! నాకే కాస్త చనువు అన్నయ్య దగ్గర.

"నువ్వివాళ నాతో వస్తున్నావు, తెలిసిందా!" అన్నయ్య వెళ్ళిపోయాడు.

అది తిరుగు లేని ఆజ్ఞ.

నాకు ఒక్కసారిగా ఏడుపు ముంచుకొచ్చింది. సాయంత్రం నీరజ పుట్టిన రోజు పార్టీ. స్నేహితులందరం కలిసి మంచి ప్రజంటేషను కొన్నాం. సాయంత్రం పార్టీ కోసం షాపులన్నీ గాలించి కొన్న ఎరుపు రంగు కాశ్మీరు సిల్కుచీర కళ్ళముందు కెంపులా మెరిసింది. ఎట్లా? అన్నయ్యతో రానని ఎలా చెప్పాలో తెలియటం లేదు. దాదాపు గంట తర్వాత అన్నయ్య వచ్చాడు.

"అమ్మడూ! అయిందా, బయలుదేరు. ఆలస్యం చేసిన కొద్దీ చీకటి పడిపోతుంది!" అంటున్న అన్నయ్య మాటలు విని కూడా ముసుగుతన్ని పడుకున్నాను.